సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 10 । జనవరి । 2024



బోనం మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.



ఆహ్వానపత్రం అందజేత

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో 12న నిర్వహించే శ్రీగోదారంగనాథుల కల్యాణానికి రావాలని కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ మంత్రి ప్రభాకర్‌గౌడ్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

30.0/18.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్పీ

వీర్నపల్లి(సిరిసిల్ల): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండల కేంద్రంలోని ట్రాక్టర్, టెంట్ హౌజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, మంగళవారం ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మండలంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలోగల అన్ని గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి ప్రతి గ్రామంలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం యువకులకు క్రీడాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ నవత, సర్పంచ్ దినకర్ పాల్గొన్నారు.

పండుగ తర్వాత పవర్‌లూమ్స్ బంద్



సమావేశంలో పాలిస్టర్ అసోసియేషన్

సిరిసిల్ల: సంక్రాంతి పండుగ తర్వాత ఈనెల 15 నుంచి పాలిస్టర్ వస్త్రోత్పత్తిని నిలిపివేయనున్నట్లు సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ ప్రకటించింది. అసోసియేషన్ భవన్‌లో జరిగిన సమావేశంలో పాలిస్టర్ వస్త్రానికి ధర లేక, పరిశ్రమలో నెలకొన్న మాంద్యం కారణంగా పవర్‌లూమ్స్, వార్పిన్ యూనిట్లను బంద్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయిన వస్త్రానికి మార్కెట్‌లో ధర లేక, వస్త్రం నిల్వలు పేరుకుపోయాయని, ఇతర కొత్త ఉత్పత్తి ఆర్డర్లు రాకపోవడంతో పరిశ్రమను బంద్ చేయాలని నిర్ణయించామని అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి యెల్దండి దేవదాస్ ప్రకటించారు. పరిశ్రమ బంద్‌కు ఆసాములు, కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు సహకరించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి పోరండ్ల మల్లేశం, కోశాధికారి శ్రీరాం సత్యనారాయణ, అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దూడం శంకర్, గోవిందు రవి, దూస భూమయ్య, అర్బన్ బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణ, మాజీ కార్యదర్శి ఆడెపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. పాలిస్టర్ అసోసియేషన్ నిర్ణయంతో సిరిసిల్లలో వస్త్రోత్పత్తి రంగం స్తంభించనుంది. దీనిపై ఆధారపడిన నేత కార్మికులకు ఉపాధి కరువు అవుతుంది.

కోడెల అక్రమ రవాణాపై విచారణ చేపట్టాలి




వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

వేములవాడఅర్బన్: రాజన్న కోడెల అక్రమ రవాణాపై విచారణ చేపట్టాలని విశ్వహిందు పరిషత్ గోరక్ష సమితి దక్షిణ భారత ప్రముఖ్ యాదగిరిరావు అన్నారు. ఇటీవల 'సాక్షి' మెయిన్ పేజీలో ప్రచురితమైన 'రాజన్న కోడెలు పక్కదారి' కథనంతో తిప్పాపూర్, గుడి చెరువు కట్ట కింద గోశాలను మంగళవారం సందర్శించారు. అనంతరం ఆలయ ఏఈవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజన్న కోడెల ద్వారా ఏడాదికి సుమారు రూ.20 కోట్ల ఆదాయం వస్తోందని, కానీ గోశాల నిర్వహణకు కోటి రూపాయలు కూడా ఖర్చు చేయకపోవడం బాధాకరమన్నారు. గోశాలకు పూర్తిస్థాయి వైద్యుడిని కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గోరక్ష అధ్యక్షుడు ఈసంపల్లి వెంకన్న, రాధాకృష్ణారెడ్డి, గడప కిషోర్‌రావు, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి ప్రభుత్వ పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, సెక్టోరియల్ పద్మజ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ అంశాలు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. 3వ తరగతి విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠాలు చదివించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.ఎల్లయ్య, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ జర్నీ

- జిల్లాలో కోతకు గురైన 21 రోడ్లు
- మరమ్మతుకు నిధులు కరువు
- డివైడర్లను ఢీకొంటున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు



ఇది ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి–బుగ్గరాజేశ్వరతండా గ్రామాల మధ్య కల్వర్టు. కల్వర్టు వద్ద మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. గత వర్షాకాలంలో రోడ్డు కోతకు గురికాగా అధికారులు ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. ఆ గ్రామ సర్పంచ్ అజ్మీర రజిత పంచాయతీ నిధులతో తాత్కాలికంగా పనులు చేయించినా ఫలితం లేకుండా పోయింది.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/వేములవాడఅర్బన్: జిల్లా వ్యాప్తంగా రహదారులు కోతకు గురయ్యాయి. ఏమాత్రం ఏమరుపాటుగా వెళ్లినా ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 52 రహదారులు ఉండగా.. 21 రోడ్లు కోతకు గురయ్యాయి. గతేడాదిగా కోతకు గురైన రోడ్లను అధికారులు మరమ్మతు చేయడం లేదు. కొన్ని రోడ్లకు నిధులు మంజూరైనా పనులు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఎల్లారెడ్డిపేట మండలం పదిర వంతెనపై రోడ్డు కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకరగుంతను అధికారులు గుర్తించి పూడ్చివేయడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయడం లేదు.

అధ్వానంగా 21 రోడ్లు

జిల్లా వ్యాప్తంగా 21 రోడ్లు కోతకు గురయ్యాయి. గతంలో వర్షాలు కురిసిన ప్రతీసారి ఏదో ఒక రోడ్డు కోతకు గురవుతూనే ఉంది. అయితే ఆయా రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరుకాకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని చోట్ల నిధులు వచ్చినా పనులు చేపట్టడం లేదు. – ఇల్లంతకుంట–జిల్లెల్ల, నారాయణపూర్–బండలింగంపల్లి, బండలింగంపల్లి–ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి, ముస్తాబాద్–ఆవునూర్, అక్కపల్లి–కోనరావుపేట మండలం శివంగాలపల్లి, కోనరావుపేట–మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట–వీర్నపల్లి, సముద్రలింగాపూర్–దమ్మన్నపేట, గంభీరావుపేట–లింగన్నపేట, అక్కపల్లి–బుగ్గరాజేశ్వరతండా రహదారుల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. కోతకు గురైన రోడ్ల వద్ద కనీసం హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయలేదు.

ఇప్పుడైనా దుస్థితి మారేనా?

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రోడ్ల మరమ్మతుకు నిధులు వస్తాయనే ఆశతో ఆయా ప్రాంతాల ప్రజలు ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కోతకు గురైన రోడ్లను పరిశీలించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా డివైడర్లు

నిత్యం వాహనాల రద్దీ ఉండే కరీంనగర్–సిరిసిల్ల, నాంపల్లి–వేములవాడ రహదారులు ప్రమాదకరంగా మారాయి. డివైడర్లకు వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. ఫోర్‌లేన్ రోడ్డు నుంచి డబుల్‌రోడ్డుకు మారడంతో డివైడర్‌కు ఎలాంటి





పదిర వంతెనపై ప్రమాదకరంగా గుంత, కరీంనగర్– సిరిసిల్ల రహదారి కొడుముంజ శివారులో డివైడర్ దుస్థితి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి పూట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

ఆరెపల్లి శివారులోని మిడ్‌మానేరు బ్రిడ్జి వద్ద డివైడర్ చివర రోడ్డు గుంతలు పడి ఉండడంతో రెండు నెలల క్రితం వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన ముద్రకోల దేవరాజు(21) బైక్ అదుపు తప్పి మృతిచెందాడు. రుద్రవరం గ్రామానికి చెందిన పాముల పర్శరాములు(55) నాంపల్లి నుంచి బైక్‌పై వస్తుండగా అనుపురం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

డివైడర్‌ను ఢీకొడుతున్న వాహనాలు

సిరిసిల్ల–కరీంనగర్ రహదారి నందికమాన్ నుంచి కొడుముంజ ప్రారంభం వరకు ఫోర్‌లేన్ రోడ్డు.. అక్కడి నుంచి ఆరెపల్లి శివారులోని మిడ్‌మానేరు బిడ్జి వరకు డబుల్ రోడ్డుగా ఉంది. కొడుముంజ ప్రారంభంలో ఉన్న డివైడర్‌ను కరీంనగర్ నుంచి వస్తున్న వాహనలు రాత్రి పూట ఢీకొడుతున్నాయి. ఇటీవల లారీ ఢీకొట్టడంతో డివైడర్ శిథిలమైంది. నాంపల్లి నుంచి వేములవాడకు వెళ్లే దారిలో నాంపల్లి గుడికుంట చివర ఉన్న డివైడర్ వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి.

మరమ్మతు చేయాలి



వర్షాకాలంలో కోతకు గురైన రోడ్లకు వెంటనే మరమ్మతు చేయాలి. ప్రమాదకరంగా ఉన్న రోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం. అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. – దడిగెల పర్శరాంరెడ్డి, బండలింగంపల్లి

డివైడర్‌ను ఢీకొడుతున్నాయి



కొడుముంజ శివారులోని డివైడర్‌ను కరీంనగర్ నుంచి వస్తున్న వాహనాలు రాత్రిపూట ఢీకొడుతున్నాయి. నాంపల్లిలోని గుడికుంట చివరన డివైడర్ వద్ద హెచ్చరిక బోర్డులు లేవు. రాత్రిపూట డివైడర్ కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. – వేముల నాగరాజు, కొడుముంజ

హెచ్చరిక బోర్డులు పెడతాం



మిడ్‌మానేరు ప్రాజెక్ట్ బ్రిడ్జి నుంచి వేములవాడ నందికమాన్ వరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. కొడుముంజ శివారులోని డివైడర్‌కు, నాంపల్లి రోడ్డు డివైడర్‌కు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.

– శాంతయ్య, వేములవాడ ఆర్అండ్‌బీ డీఈ

ప్రతిపాదనలు పంపినం

కోతకు గురైన రోడ్లను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతాం. కోతకు గురైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తొందరలోనే రోడ్లను మరమ్మతు చేస్తాం.

– కిరణ్, ఆర్అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట

పార్లమెంట్ స్థానాలు గెలవాలి



సీఎం రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా నేతలు

- వివాదాల జోలికి వెళ్లొద్దు
- ఉమ్మడి జిల్లా నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

కరీంనగర్ కార్పొరేషన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రెండు స్థానాలను కైవసం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. మంచి అధికారులను ఎంచుకోవాలని, వివాదాల జోలికి వెళ్లొద్దని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఉమ్మడి జిల్లా నేతలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు, జిల్లాల అభివృద్ధిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి మాట్లాడారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మినహా నేతలంతా హాజరయ్యారు. కరీంనగర్, పెద్దపల్లి లోకసభ స్థానాలు గతంలో కాంగ్రెస్ ఖాతాలో ఉన్నవేనని, వాటిని తిరిగి గెలుచుకోవాలని సీఎం అన్నారు. నియోజకవర్గాల్లో నిధులు ఖర్చు చేసే బాధ్యత సంబంధిత ఎమ్మెల్యేలదేనని, ఎమ్మెల్యేలు లేనిచోట పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా చేపట్టాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో అవినీతికి అవకాశం ఇవ్వరాదని, వివాదాల జోలికి వెళ్లొద్దని సూచించినట్లు సమాచారం. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని నేతలు సన్మానించారు. బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, రామగుండం, పెద్దపల్లి, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చింతకుంట విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్, హుజూరాబాద్, సిరిసిల్ల, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జీలు పురుమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్ బాబు, కె.కె.మహేందర్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

వేములవాడరూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు. పథకాలను ప్రజలకు వివరిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో దళారులు ఎక్కువ అని విమర్శించారు. రైతుల కోసం మోదీ సర్కార్ కిసాన్ సమ్మాన్ నిధి కింద ఎకరాకు రూ.6 వేల నగదు అందిస్తుందని, పేదలెవరూ ఇండ్లు లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు కట్టించిన మహానుభావుడు మోదీ అని వివరించారు. ఆరు గ్యారంటీల హామీతో విజయం సాధించిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడానికి ఆర్థిక వనరులు లేక కాలయాపన చేస్తుందని విమర్శించారు. సర్కారు బడిలో స్కావెంజర్స్ లేక కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే బాత్‌రూమ్స్ కడిగిన దుస్థితి ఉందని, అలాంటి ఏరియాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వనరులను కొల్లగొట్టిందని, అప్పులో ఊబిలో ఉన్న రాష్ట్రంలో ప్రస్తుత అధికార పార్టీ గ్యారంటీలను ఎలా అమలు చేస్తారో ప్రజలకు వివరించాలన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అహంకారపూరితంగా మాట్లాడితే బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతి కాంగ్రెస్‌కూ పడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు చెన్నమనేని వికాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర టెలికాం డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యుడిగా బుగ్గారెడ్డి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి కేంద్ర టెలికాం డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియామకం అయ్యారు. ఈ మేరకు రెండు రోజుల్లో ఉత్తర్వులను ఎంపీ బండి సంజయ్‌కుమార్ అందజేయనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. ఈసందర్భంగా బుగ్గారెడ్డి మాట్లాడుతూ, తనను కమిటీ సభ్యుడిగా నియమించడంపై కేంద్ర టెలికాం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోండి



మిల్లెట్ ముగ్గును పరిశీలిస్తున్న మాజీ సీఎం చౌహాన్, ఎంపీ సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి

- మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

మానకొండూర్: దేశంలోని పేద ప్రజల కోసం ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. మానకొండూర్ మండలంలోని కొండపల్కల గ్రామంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, హోం మంత్రిత్వ శాఖ డైరెక్టర్ యోగేశ్ మోహన్ దీక్షిత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కేంద్ర పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్, అటల్ పింఛన్, జనధన్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, ముద్ర లోన్లు తదితర పథకాలను వివరించారు. అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ.. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంపీ సంజయ్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్‌తో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో ఎక్కడైనా రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పోస్టర్, క్యాలెండర్ ఆవిష్కరించారు. బీజేపీ కార్యకర్త, ఎంపీటీసీ సభ్యుడు గుర్రాల వెంకటరెడ్డి ఇంటికి వెళ్లిన శివారాజ్ సింగ్ చౌహాన్ ఆయన కుటుంబసభ్యులతో టీ తాగి, సర్వపిండి తిన్నారు. సర్వపిండి చాలా బాగుందని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ఎస్‌బీఎం కిషన్‌స్వామి, ఎల్‌డీఎం ఆంజనేయులు, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, సర్పంచ్ వంశీధర్‌రెడ్డి, ఎంపీటీసీ రజిత, నాయకులు పాల్గొన్నారు.

కస్టం మిల్లింగ్ లక్ష్యం పూర్తి చేయండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఎఫ్‌సీఐకి రైస్ మిల్లర్‌లు ఇవ్వాల్సిన బియ్యం టార్గెట్ కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రోజు వారీగా టార్గెట్ నిర్దేశించుకుని పూర్తి చేయాలన్నారు. న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసులు మినహా ఇతర సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈ అంశంలో ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ పనితీరు బాగుందని కితాబిచ్చారు.

మీ సేవలపై సమీక్ష..

మీ సేవ సర్వీసెస్ పెండింగ్‌పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. తంగళ్లపల్లి, కోనరావుపేట, బోయినపల్లి మండలాల్లో ఆదాయ సర్టిఫికెట్ దరఖాస్తులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని త్వరగా పూర్తి చేయాలన్నారు. రొటీన్ జాబ్ తహసీల్దార్లు నిర్లక్ష్యం చేయవద్దని, వారం రోజుల్లో రెవెన్యూ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. తంగళ్లపల్లి మండల సర్వేయర్ పనితీరు బాగోలేదని అతడిపై చార్జెస్ ఫ్రేం చేయాలని అదనపు కలెక్టర్‌కు సూచించారు. ఓటరు జాబితాలో డబుల్, డూప్లికేట్, డెత్ ఓటర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



భాస్కర్, డీఏవో

సిరిసిల్ల: జిల్లాలో యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువులు, యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మంగళవారం తెలిపారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని ప్రాంతాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు అమ్ముతున్నట్లు ప్రచారం జరిగిందని, ఎవరైనా ఎక్కువ ధరకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం యూరియా 9,462 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, డీఏపీ 703 మె.ట, కాంప్లెక్స్ ఎరువులు 2,212 మె.ట, ఎంవోపీ ఎరువులు 152 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఎవరైనా అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

'కూత'కు రెడీ

- రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సన్నద్ధం



ముస్తాబాద్‌లో శిక్షణ పొందుతున్న యువతుల జట్టు

సిరిసిల్ల: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు సన్నద్ధమవుతుంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువకులు, యువతుల జట్లు శిక్షణ పొందుతున్నాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఈనెల 11,12,13,14 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్–20 కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. యువకుల జట్టుకు 16 మందిని ఎంపిక చేశారు. మరోవైపు యువతులకు ముస్తాబాద్ మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. సిరిసిల్లలో సీనియర్ కోచ్ ప్రశాంత్, ముస్తాబాద్‌లో కోచ్ గీన శ్రీనివాస్(పీసీ) పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్యదర్శి సింగారపు తిరుపతి, సిరిసిల్ల అధ్యక్షుడు బొడ్డు నారాయణ పర్యవేక్షణలో శిబిరం సాగుతుంది.



సిరిసిల్ల కళాశాల మైదానంలో క్రీడాకారుల శిక్షణ

స్కాలర్‌షిప్ హార్డ్ కాపీలు అందించాలి

సిరిసిల్ల: జిల్లాలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్–2023కు సంబంధించిన హార్డ్ కాపీలను సమర్పించాలని, 2024కు రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి.గౌతమి కోరారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లకు సంబంధించి 228 పెండింగ్ హార్డ్ కాపీలు ఈ నెలాఖరులోగా సమర్పించాలన్నారు. అలాగే 2023–24కు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఇప్పటివరకు 1,673 పూర్తయ్యాయని, వేగవంతం చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఎస్సీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ ఎస్సీ వెల్ఫేర్ అధికారి విజయలక్ష్మి, పర్యవేక్షకులు అజామ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేకొండవాసికి డాక్టరేట్ అందజేత


సంపత్‌రెడ్డికి పట్టా ఇస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

చిగురుమామిడి(హుస్నాబాద్): చిగురుమామిడి మండలంలోని రేకొండకు చెందిన చాడ సంపత్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. వివరాల్లోకి వెళ్తే.. చాడ కమల–భూపతిరెడ్డి దంపతుల చిన్న కుమారుడు సంపత్‌రెడ్డి 'సెక్యూర్ ఎనర్జీ ఎఫిషియెంట్ రూటింగ్ టెక్నిక్స్ ఫర్ లార్జ్ స్కేల్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్' అంశంలో పరిశోధన చేశారు. ఈ నెల 5న హైదరాబాద్ జేఎన్‌టీయూలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ఇస్రో చైర్మన్ సోమనాథ్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు. సంపత్‌రెడ్డి ప్రస్తుతం కరీంనగర్‌లోని శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నోలాజికల్ సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

మిత్రుడిని గల్ఫ్ పంపించి.. తిరిగి రాని లోకాలకు

- బెజ్జంకి వద్ద రోడ్డు ప్రమాదం
- జగిత్యాల వాసి దుర్మరణం


మృతిచెందిన అస్లాం


బోల్తాపడిన కారు

జగిత్యాలక్రైం: మిత్రుడిని గల్ఫ్ పంపించి తిరిగి వస్తుండగా.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి సమీపంలో కరీంనగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో జగిత్యాల పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన అస్లాం (26) అక్కడికక్కడే మృతిచెందాడు. ఇస్లాంపురకు చెందిన నలుగురు వ్యక్తులు సోమవారం రాత్రి ఓ మిత్రుడిని గల్ఫ్ పంపించేందుకు శంషాబాద్ ఏయిర్‌పోర్ట్‌కు వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి వస్తుండగా బెజ్జంకి వద్ద కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో బోల్తాపడింది. ఘటనలో కారు ముందుభాగంలో కూర్చున్న అస్లాం అక్కడికక్కడే మృతిచెందాడు. సోహెల్, యాకుబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అస్లాంకు రెండేళ్ల క్రితం వివాహమైంది. 15రోజుల క్రితమే కుమారుడు జన్మించాడు. జగిత్యాల కొత్తబస్టాండ్ టేలాలో పాన్‌టేలా నిర్వహిస్తున్నాడు. అస్లాం మృతిచెందడంతో ఇస్లాంపురలో విషాదం చోటుచేసుకుంది.

ఆమె కళ్లు సజీవం


వజ్రమణీదేవి (ఫైల్)

కరీంనగర్‌టౌన్: నగరానికి చెందిన రాజూరి వజ్రమణీదేవి(80) వృద్ధాప్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. తల్లిని కోల్పోయిన బాధలోనూ కుమారుడు డాక్టర్ రాజూరి వెంకటేశ్వర్లు ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యులకు సమాచారం అందించారు. దీంతో క్లబ్ సభ్యులు డాక్టర్ బంగారిస్వామి, మేకల అరవింద్ చొరవతో వజ్రమణీదేవి కళ్లను సేకరించి, హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఆమె కుటుంబసభ్యులు లయన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అభినందించారు. క్లబ్ బాధ్యులు వై.శేఖర్‌రావు, ఎం.మహేందర్, కె.సత్యం, కె.రాజేందర్ రెడ్డి, ఎస్.ప్రసాద్‌రావు, బి.నర్సింగరావు, ఈ.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విచారణ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వన్‌టౌన్ పోలీసులు విచారణ జరిపారు. ఇటీవల ఆ ఆఫీస్‌లో గుర్తు తెలియని వ్యక్తి రికార్డు గదిలోకి ప్రవేశించి, కొన్ని దస్త్రాలు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వన్‌టౌన్ కొత్త సీఐగా సరిలాల్ బాధ్యతలు స్వీకరించగా ఈ కేసులో మంగళవారం విచారణ చేపట్టారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
గాంధీ చౌక్ బ్రాంచ్ (20140), సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా
జప్తు చేసిన వాహనం యొక్క అమ్మకం

క్ర. సం.	A/c. హోల్డర్ పేరు	వాహనం వివరణ ఆర్.జి. నెం./మోడల్	రిజర్వు ధర EMD	వేలం సమయం	సంప్రదించు నెం.
1	శ్రీధర్ గాజుల, తండ్రి: రాజయ్య, నివాసం: 12-10-32, సర్దార్‌నగర్, సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా	మారుతి-డిజైర్, VDI BS-IV, వాహనం నెం: TS23 A-8234, Mfg. సం: 2018, Eng. No: D13A3255941 Reading: 243002 Km	Rs. 4,15,000/- EMD: 10%	ఉ॥ 11-00 గం॥లు	9701452180

వేలం/ అమ్మకం నియమ నిబంధనలు
1) పైన తాకట్టు పెట్టిన మారుతి స్విఫ్ట్ డిజైర్ కొనుగోలు కోసం గాంధీచౌక్ బ్రాంచ్ (20140) సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా వద్ద 17-01-2024న ఉ॥ 11-00 గం॥లలోగా కొటేషన్లు కోరబడుచున్నవి.
2) వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల బిడ్డర్లు గాంధీచౌక్ బ్రాంచ్ (20140) సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా వద్ద చెల్లించుటకేలా స్టేట్ బ్యాంక్ ఇండియా పేరున పే ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ప్రతి ఆస్తికి ఎదురుగా పైన తెలిపిన రిజర్వు ధరలో 10% వాపసు ఇవ్వబడే (EMD) ని చెల్లించవలెను.
3) సీల్డ్ కొటేషన్‌లో అత్యధిక అమ్మకం ధరను ఆఫర్ చేసిన గెలుపొందిన బిడ్డరు గాంధీచౌక్ బ్రాంచ్ (20140) సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా వద్ద చెల్లించుటకేలా స్టేట్ బ్యాంక్ ఇండియా పేరున పే ఆర్డర్/ డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో పూర్తి మొత్తాన్ని చెల్లించవలెను. లేనట్లయితే డిపాజిట్ చేసిన పూర్తి మొత్తం స్వాధీనం చేసుకోబడుతుంది మరియు ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది మరియు విఫలమైన కొనుగోలుదారు తదుపరి విక్రయించబడే ఆస్తిపై లేదా మొత్తంలోని ఏదేని భాగంపై అన్ని హక్కులను కోల్పోతారు.
4) పైన తెలిపిన ఆస్తి " రిజర్వు ధర " కంటే తక్కువకు విక్రయించబడదు.
5) సీల్డ్ టెండరు ద్వారా అందిన అత్యధిక బిడ్‌తో బ్యాంక్ మేనేజర్/ ఫీల్డ్ ఆఫీసర్ సంతృప్తి చెందనట్లయితే, టెండరు ఫారాలు దాఖలు చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం ద్వారా తదుపరి బిడ్ వేసేందుకు అనుమతించవచ్చు.
6) ఎటువంటి కారణం తెలియజేయకుండా అధీకృత అధికారి బిడ్/ కొటేషన్ అంగీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు లేదా పైన తెలిపిన అన్ని/ ఏదేని ఆస్తుల వేలాన్ని వాయిదా వేయవచ్చు/ రద్దు చేయవచ్చును.
7) గెలుపొందిన బిడ్డరు వర్తించే విధంగా టిడిఎస్, రిజిస్ట్రేషన్ రుసుము, స్టాంప్ డ్యూటీ మొ॥వాటి కోసం చెల్లించవలసిన ఛార్జీలు భరించవలెను.
8) అత్యధిక బిడ్డరు పేరున అమ్మకం సర్టిఫికేట్ వాస్తవ రిజిస్ట్రేషన్‌లోగా రుణగ్రహీత బ్యాంక్‌కు రుణాన్ని (బ్యాంకుకు అయిన అన్ని ఖర్చులతో పాటు) చెల్లిస్తే వేలం రద్దు చేయబడుతుంది మరియు అత్యధిక బిడ్డరు డిపాజిట్ చేసిన నగదు తిరిగి ఇవ్వబడుతుంది మరియు వేలానికి సంబంధించి అత్యధిక బిడ్డరు డిపాజిట్ చేసిన నగదుపై ఎటువంటి వడ్డీ చెల్లించబడదు.
9) తనిఖీ మరియు తదుపరి స్పష్టీకరణల కోసం సంప్రదించండి: ఫోన్ నెం.లు: 9701452180.

తేది: 09-01-2024
ప్రదేశం: సిరిసిల్ల
సం/-, చీఫ్ మేనేజర్

ప్రజలకు చేరువలో 'ప్రజాపాలన'

- అందుబాటులోకి ప్రత్యేక వెబ్‌సైట్
- దరఖాస్తు స్థితి తెలుసుకునే వెసులుబాటు



కరీంనగర్‌అర్బన్/జ్యోతినగర్/(రామగుండం): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకు పాలనే లక్ష్యంగా ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రజాపాలన చేపట్టింది. ఆదిశగా మరో అడుగు ముందుకేసింది. ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి ప్రజాపాలన వివరాలు అందుబాటులోకి తీసుకురానుంది. ఈమేరకు (వెబ్‌సైట్:prajapalana. telangana. gov.in)వెబ్‌సైట్ రూపొందించింది.

ఉమ్మడి జిల్లాలో స్పందన..

- ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోని ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది.
- కరీంనగర్ జిల్లాలో 3,54,363, పెద్దపల్లిలో 2,69,461, సిరిసిల్లలో 1,90,965, జగిత్యాలలో 3,24,532 లక్షల మంది వివిధ పథకాల కోసం దరఖాస్తు చేశారు.
- స్వీకరించిన దరఖాస్తులను ఈనెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు..

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎనిమిది రోజుల పాటు సాగిన ప్రజాపాలనలో మహాలక్ష్మి, రూ.500కే వంట గ్యాస్, కొత్త రేషన్ కార్డుల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి పరిశీలన కీలకం కావడంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఆన్‌లైన్‌లో నమోదు..

- ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేపనిలో అధికారులు ఉన్నారు.
- ఈనెల 17 వరకు నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు.
- దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఎంట్రీ అయిన తర్వాత వెబ్‌సైట్‌లో దరఖాస్తు స్థితిని తెలుసుకోవటానికి అవకాశం ఉంటుంది.
- తొలుత ప్రజాపాలన వెబ్‌సైట్‌లోకి వెళ్లి ×యువర్ అప్లికేషన్ స్టేటస్‌® పై క్లిక్ చేస్తే దరఖాస్తు నంబర్ అడుగుతుంది.
- దానిని నమోదుచేస్తే దరఖాస్తు స్థితి, ఏఏ పథకాలకు అర్హులుగా ఉన్నారనే విషయాలను తెలుసుకోవచ్చు.
- ప్రజాపాలనను ప్రతీ నాలుగు నెలలకోసారి నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే.

ఓటీపీలు చెప్ప వద్దు..

'ఓటీపీలు చెప్ప వద్దు. డబ్బులు పోగొట్టుకోవద్దు' అని పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. ఈమేరకు వారు విడుదల చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అజాగ్రత్తగా ఉండకూడదని, సైబర్ నేరగాళ్లతో చాలా అప్రమత్తంగా ఉండాలిని సూచిస్తున్నారు.

- ఎవరు ఫోన్‌చేనా ఓటీపీ చెప్పవద్దు

అప్రమత్తంగా ఉండండి



ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి. చిన్నపిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వరాదు. గ్యారంటీ స్కీంలకు దరఖాస్తు చేసుకున్నారా అని ఫోన్లు వచ్చి ఓటీపీలు చెప్పాలంటే ఎవరూ చెప్పకూడదు. అలాంటి ఫోన్లు వచ్చిన నంబర్లను పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి. బ్యాంకు అధికారులని, క్రెడిట్ కార్డు వచ్చిందని, మీ ఖాతా అప్‌డేట్ చేస్తామని ఫోన్‌లకు సమాచారం వస్తే వాటిని తిరస్కరించాలి.

– జీవన్, ఎస్సై, ఎన్టీపీసీ

- ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసినవారు మరింత అప్రమత్తంగా ఉండాలి
- గ్యారంటీల పేరుతో సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉంది
- దరఖాస్తుదారులకు ప్రభుత్వ నుంచి ఎలాంటి ఓటీపీలు రావు
- చిన్నపిల్లలకు ఫోన్లు ఇవ్వకూడదు
- ఫేక్ మెసేజ్‌లని ఓపెన్ చేయకూడదు

టైర్ పగిలి ఇంధనం లారీ బోల్తా

- పెద్ద ఎత్తున చెలరేగిన మంటలు
- సురక్షితంగా బయటపడ్డ డ్రైవర్
- విద్యుత్ శాఖకు రూ.5లక్షల నష్టం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మెట్‌పల్లి: ఇంధనంతో వెళ్తున్న ఓ లారీ టైర్ అకస్మాత్తుగా పగిలిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. దీంతో స్థానికులు కొన్ని గంటలపాటు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ముప్పు తప్పింది. మల్లాపూర్ మండలం రాఘవపేటలోని ఓ హెచ్‌పీ పెట్రోల్ బంకుకు హైదరాబాద్ సమీపంలోని ఘట్‌కేసర్ నుంచి సోమవారం రాత్రి ఓ లారీ సుమారు 22వేల లీటర్ల ఇంధనంతో బయల్దేరింది. వేకువజామున 4.30గంటల ప్రాంతంలో మెట్‌పల్లి శివారుకు చేరుకోగానే ఒక టైరు పగిలిపోయింది. దీంతో వాహనం ఆదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ కిందకు దూకాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో మంటలు లేచి ఇంధనానికి అంటుకున్నాయి. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవి హుటాహుటిన అక్కడకు చేరుకొని జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. సమీపంలోనే ఒకవైపు పెట్రోల్ బంకు, గురుకుల పాఠశాల.. మరోవైపు ఓ అపార్ట్‌మెంట్ ఉంది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందారు. ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి మంటలను ఆదుపు చేయడానికి ప్రయత్నించారు. ఒక్క వాహనం సరిపోకపోవడంతో మరో వాహనాన్ని రప్పించారు. వాహనం పేలకుండా నీళ్లు చల్లారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి మురళీ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. అప్పటికే ట్యాంకర్ పూర్తిగా దహనమైంది. ఘటనలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కాలిపోయాయి. ప్రమాదం ద్వారా విద్యుత్‌శాఖకు సుమారు రూ.5లక్షల నష్టం జరిగిందని ఏఈ రవి తెలిపారు. అలాగే ప్రమాద స్థలం పక్కనే ఉన్న అలీం అనే వ్యక్తి స్క్రాప్ దుకాణంలో కొంత సామగ్రి కాలిపోయింది. తనకు రూ.10లక్షల నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనలో ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

డబ్బులు ఇవ్వమని బెదిరింపులు

- ముగ్గురి అరెస్టు
- పరారీలో మరొకరు


అరెస్టు చూపుతున్న సీఐ కిశోర్

ఇల్లందకుంట(హుజూరాబాద్): డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు మంగళవారం ముగ్గురిని అరెస్టు చేసినట్లు జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లికి చెందిన అబ్బిడి సురేందర్‌రెడ్డి, అతని స్నేహితులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలానికి చెందిన ఎండీ.రియాజ్, జివ్వాజి కుమారస్వామి, చిలుక సురేష్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. అమాయక ప్రజలను డబ్బులు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడుతున్నారు. బాధితుల్లో ఒకరు వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, సురేష్ పరారీలో ఉన్నాడని సీఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- పొలంలో పనిచేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగ


మధుప్రియ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పొలం పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మహిళ చనిపోయిన విషాద ఘటన తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరుకు చెందిన మల్లబోయిని మధుప్రియ(28) తమకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో మంగళవారం వరినాట్లు వేసేందుకు వెళ్లింది. వరినాట్లు వేస్తున్న క్రమంలో పొలం పైనుంచి ఉన్న విద్యుత్ వైరుకు (కరెంట్ పోల్ నుంచి మోటార్‌కు వెళ్లే వైరు) కట్టిన జే వైరు (ఇనుప తీగ) తెగి పొలంలో పడింది. వరినాట్లు వేస్తున్న మధుప్రియ తీగను పక్కకు జరిపేందుకు ప్రయత్నించగా ఇనుప తీగకు విద్యుత్ సరఫరా అయ్యి షాక్‌కు గురైంది. చుట్టుపక్కలవారు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త రాకేశ్, కొడుకు రిషివర్ధన్, కూతురు రిషిక ఉన్నారు. తల్లి పొలం పనులకు వెళ్లి ప్రాణాలు కోల్పోవడంతో పిల్లల రోదనలు చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన నాగరాజు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట–గంభీరావుపేట మండలాల సరిహద్దు సముద్రలింగాపూర్ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైనాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన చాకలి నాగరాజు, మరో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డారు. గుర్తు తెలియని వృద్ధుడి పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న పోలీస్

కరీంనగర్‌క్రైం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. కరీంనగర్ గాంధీరోడ్డు ఏరియాలోని ఓ ఇంట్లో దాసం భాగ్యవతి అద్దెకు ఉంటోంది. శనివారం సాయంత్రం తాళం వేసి, తీగలగుట్టపల్లిలో ఉంటున్న పెద్దకూతురు జోత్స్న వద్దకు వెళ్లింది. మంగళవారం ఉదయం తలుపు గడియ తీసి ఉండటంతో చుట్టుపక్కలవారు ఆమెకు ఫోన్ చేసి, విషయం చెప్పారు. భాగ్యవతి వెంటనే వచ్చి చూడగా లోపల రెండు బీరువాల్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించగా డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. రూ.8 వేలు, రూ.7 వేల విలువైన బంగారం పోయినట్లు బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: శాస్త్రీనగర్‌కు చెందిన పోలోజు నాగరాజు(38) మంగళవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నాగరాజు మూడేళ్ల క్రితం రైస్‌మిల్లు ఆపరేటర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం ఖాళీగానే ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయలేక, ఏ పనీ లేదని తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలో మంగళవారం వేకువజామున స్థానిక నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల కార్యాలయం వద్ద గల చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

అప్పు గురించి నిలదీయడంతో..

పెద్దపల్లిరూరల్: అప్పు ఎందుకు చేస్తున్నావని భార్య నిలదీయడంతో బుషణవేన శ్రీనివాస్‌గౌడ్ అనే యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన బుషణవేన శ్రీనివాస్‌గౌడ్(39) కొంతకాలం క్రితం మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల ఓ ఫైనాన్స్ కంపనీలో అప్పు చేశాడు. ఆ సొమ్ము మద్యానికి ఖర్చు చేశాడు. ఈ విషయమై భార్య సుమలత నిలదీయడంతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

ఆటో బోల్తాపడి: ఆరుగురికి గాయాలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ శివారులోని జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. చల్‌గల్ గ్రామానికి చెందిన లక్ష్మీ, మహేందర్‌తోపాటు మరో నలుగురు ప్రయాణికులు ఆటోలో వెళ్తున్నారు. ప్రధాన రహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురికి స్వల్పగాయాలు.. లక్ష్మీ, మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై మంగళవారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణం చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

'అల్ఫోర్స్' విద్యార్థులకు కాంస్య పతకాలు


అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): తమిళనాడులో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టెన్నీస్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తపల్లి అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎల్.దీక్షిత్, జి.సిరిశరణ్‌లు కాంస్య పతకాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 7,105 విద్యార్థుల దరఖాస్తు
- 36 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఈ నెల 20న పరీక్ష

చొప్పదండి: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,105 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికి హాల్‌టికెట్లు కేటాయించామని, ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆరోతరగతిలో 80 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, హాల్ టికెట్ డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తులో కులం కేటగిరీ, అర్బన్, రూరల్, పుట్టిన తేదీ, జెండర్ తదితరాల నమోదులో తప్పిదాలు జరిగితే అన్ని ఆధారాలతో ఈ నెల 16వ తేదీలోపు జవహర్ నవోదయ విద్యాలయ అధికారులను సంప్రదించి, సవరించుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను కేటాయించనున్నామని తెలిపారు, నవోదయలో సీటు ఇప్పిస్తామంటూ వచ్చే దళారుల మాట నమ్మి మోసపోవద్దన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్ కార్డు లేదా ప్రధానోపాధ్యాయులచే ఫొటో ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు కొరఢా ఝులిపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేస్తుండడంతో అధికారులు వాటిని పరిశీలించి కూలగొడుతున్నారు. 45వ వార్డులో రాజేందర్, 25వ వార్డులో నవనంది రవి, 35వవార్డులో ఎల్ల శ్రీనివాస్, 34వవార్డులో శేఖర్ అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులు వచ్చాయి. దీంతో టీపీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి వాటిని కూల్చివేశారు. కార్యక్రమంలో టీపీఎస్ తేజస్విని, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

జగిత్యాలక్రైం: జగిత్యాల బీట్‌బజార్‌లో ఓ అక్రమ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేస్తుండగా యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. బీట్‌బజార్ ప్రాంతంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఉదయం మున్సిపల్ అధికారులు వచ్చి నిర్మాణాన్ని తొలగించారు. అక్కడే ఉన్న బాధితుడు నిర్మాణాన్ని తొలగించవద్దంటూ పెట్రోల్ పోసుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నా పిల్లల్ని తీసుకెళ్లొద్దు.. వాహనాన్ని అడ్డగించిన తల్లి

- 'ముస్కాన్' అధికారులకు చేదు అనుభవం



చిన్నారుల తల్లితో మాట్లాడుతున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో ముగ్గురు బాలురు బడికి వెళ్లకుండా పనిచేస్తూ ఉండడంతో మంగళవారం ఆపరేషన్ ముస్కాన్ అధికారులు గుర్తించారు. వారిని తమ వాహనంలో తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో అక్కడే ఉన్న వారి తల్లి 'నా కొడుకులను తీసుకెళ్లొద్దు' అంటూ వాహనాన్ని అడ్డుకుంది. తాము ఇక్కడికి వలస వచ్చామని, స్థానిక బడిలో చేర్పిస్తానంటూ అధికారులతో వాదనకు దిగింది. వారి వాహనానికి అడ్డుగా కూర్చుంది. అధికారులు సర్దిచెప్పినా వినకుండా గొడవ చేయడంతో స్థానికులు పెద్ద ఎత్తున గుమికూడారు. చివరకు ఇద్దరు చిన్నారులను సిరిసిల్ల గురుకుల పాఠశాలకు తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇంటర్ చదివే మైనర్ బాలిక వివాహానికి పోలీసులు అడ్డుకట్టవేశారు. పేదరికాన్ని ఆసరా చేసుకుని ఓ వ్యక్తి కుటుంబ పెద్దను ఒప్పించి బాలికను వివాహం చేసుకోవాలన్న తలంపును తిప్పికొట్టారు. ముస్తాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకునేందుకు మధ్యవర్తి ద్వారా రాయబారం నడిపారు. ఈనోటా ఆ నోటా ఈ విషయం పోలీసుల వరకు చేరింది. దీంతో ఎస్సై శేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాలిక తల్లిదండ్రులతోపాటు, గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన వ్యక్తి మైనర్ బాలికను పెళ్లి చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవడంతో ఎస్సై వారికి అవగాహన కల్పించారు. మైనర్ల వివాహం చట్టరీత్యానేరమని నచ్చజెప్పారు. బాలికను ఉన్నత చదువులు చదివించాలని పేర్కొన్నారు. కాగా మధ్యవర్తి ద్వారా సదరు వ్యక్తి బాలిక తల్లిదండ్రులకు పెద్ద మొత్తంలో నగదు ఆశ చూపినట్లు తెలిసింది. మరో కన్యాశుల్కం నిరోధించడంలో పోలీసు అధికారులు విజయం సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు రాణిప్రసాద్



రాణిప్రసాద్ తయారు చేసిన కళాచిత్రాలు

సిరిసిల్లటౌన్: ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. 2023 సంవత్సరానికి గాను అరుదైన అవకాశాన్ని ఆమె సొంతం చేసుకున్నారు. పచ్చి, ఎండు ఆకులు, పూలు, గింజలు, తీగలు, కొమ్మలు, బెండు, వేర్లతో వివిధ కళాఖండాలకు సృష్టించారు. వాటి తయారీ విధానాన్ని 'మృగయాపురి' పుస్తకంలో లిఖించి పబ్లిష్ చేయించారు. కరోనా సమయంలో వ్యాసాలతో చంటిపిల్లలు, తల్లులను చైతన్య పరిచినందుకు గాను తెలుగు బుక్ రికార్డ్స్‌లో పేరు సంపాదించినట్లు వెల్లడించారు. గతంలో ఆస్పత్రిలోని వ్యర్థాలతో బొమ్మలు తయారు చేసిన ఆమె తనదైన శైలిలో ప్రస్తుతం చెట్లు, పూలతో విభిన్న ఆకృతులను తయారు చేయడం విశేషం.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలోని అంబేద్కర్ బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలైనాయి. స్థానికుల కథనం ప్రకారం.. బస్టాండ్ ప్రాంతం నుంచి నడిచి వెళ్తున్న వృద్ధుడు నక్క యూసుఫ్‌ను వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో వేములవాడ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చందుర్తి పోలీసులు తెలిపారు.

వృద్ధురాలిపై లైంగికదాడి

చందుర్తి (వేములవాడ): వృద్ధురాలిపై ఆటోడ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడంటూ బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలిపై కట్టలింగంపేటకు చెందిన ఆటో డ్రైవర్ తిరుపతి లైంగికదాడికి పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా సదరు ఆటో డ్రైవర్ మూడునెలల క్రితం ఓ వివాహితపై లైంగికదాడికి యత్నించగా ఆమె కుటుంబసభ్యులు దేహశుద్ధి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167586]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [H-793674]

■ కరీంనగర్ బ్యాంక్ వాల్యూవార్ ఆఫీస్‌లో పనిచేయుటకు డిప్లొమా సివిల్ ఇంజనీర్ కావలెను. టూ వీలర్ ఉండవలెను. గతంలో వాల్యూవార్ ఆఫీస్‌లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఫోన్: 95057 99599 [V- 797049]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824